
# ప్రతీకారం

పాలకూర సీతాలత



**జాయినింగ్** రిపోర్టు ఇచ్చి ఆఫీసరు గది లోంచి బయటకు రాగానే సెక్షనాఫీసరుని అడిగాడు పద్మనాభం—

"ఏమండీ! ... మీ ఎరికలో ఇళ్ళు ఏవైనా ఖాళీగా ఉన్నాయా?"

ఆయన ఒక నిముషం ఆలోచించి —

"ఆ మధ్య లోకేశ్వరరావు వాళ్ళ ఇంటిదగ్గర ఒక ఇల్లు ఏదో ఖాళీగా ఉందన్నాడు. అతన్ని అడుగుదాం" అన్నాడు ఆయన.

"లోకేశ్వరరావు అంటే? ..." ప్రశ్నించాడు పద్మనాభం.

"ఈ ఆఫీసులోనే యు. డి. సి. ఈ రోజు రాలేదు. రేపు చూద్దాం" అన్నా డాయన.

సెక్షన్లో అందర్నీ పరిచయం చేసుకున్నాడు పద్మనాభం. ఒక సీటు ఖాళీగా ఉంది. అది లోకేశ్వర రావు దట. అతని సీటు కూడా ఆ లోకేశ్వరరావు సీటు పక్కనే.

"ఇప్పుడు ఎక్కడ దిగారు?" అడిగాడు సెక్షనాఫీసరు.

"గోదార్లో!" అన్నాడు చిన్నగా ఒక చిన్న గుమాస్తా ముత్యాలరావు.

"ముత్యాలరావ్! కొడుకు పుట్టినా నీలో ఇంకా చిన్నతనం పోలేదోయ్?" చిన్నగా మందలించిన సెక్షనాఫీసరు పద్మనాభం వైపు తిరిగి—

"ఏమనుకోకండి ... స్టూడెంట్‌లా అల్లరి చెయ్యడం ఇంకా మానలేదు మన ముత్యాలరావు. ఈ ఆఫీసులో పనిచేసే వాళ్ళలో అతనే చిన్నవాడు. అందుకే చూసీచూడనట్లు వూరుకుంటాం" అన్నాడు.

"ఫర్వాలేదులెండి ... అలాంటి వాళ్ళంటే నాకు చాలా ఇష్టం. నేను దిగింది గోదావరి రైల్లోనే అయినా, లాడ్జిలో రూము తీసుకున్నాను" అన్నాడు పద్మనాభం.

"సర్లెండి. మీ ఇంటి సమస్య తీరిపోతుందనే అనుకుంటా" అన్నాడు సెక్షనాఫీసరు.

ఆవులించాడు పద్మనాభం.

"సారీ, సార్, రాత్రంతా నిద్రలేదు" అన్నాడు.

"ఒకపని చెయ్యండి. ఇప్పుడు వెళ్ళిపోండి. భోజనం చేసి నిద్రపోండి. రేపు ఫ్రెష్‌గా రండి ఆఫీసుకి" అన్నాడు.

"థాంక్యూ, సార్... ఇంతకీ ఆ లోకేశ్వరరావుది ఏ వూరో తెలుసా?" అడిగాడు పద్మనాభం.

"వల్లకాడు" అని కిసుక్కు న్నవ్వాడు ముత్యాలరావు.

"ముత్యాలరావ్ ... " కోపంగా అన్నాడు సెక్షనాఫీసరు.

"ఎందుకు అడిగానంటే, నాకు లోకేశ్వరరావని ఒక మిత్రుడు ఉండేవాడు ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పుడు. ఒక వేళ వాడూ, ఈయనా ..." పద్మనాభం మాటల్ని మధ్యలో త్రుంచివేస్తూ—

"ఒకరే అయి ఉండరు, సార్! వీడు పరమ రోగ్. అనుమానపు పురుగు. పెళ్ళాన్ని ఇంట్లో ఉంచి ఇంటికి తాళం పెట్టి ఆఫీసుకు వచ్చే రాష్ట్రుడు..." అన్నాడు ముత్యాలరావు.

"ఎందుకయ్యా కొత్త వ్యక్తి ముందు మన వాడి గుట్టు బయట పెడతావ్?" మందలించాడు పెక్స నాఫీసరు.

ముత్యాలరావు ఆదేం పట్టించుకోకుండా—

"కనుక అలాంటి వాడు మీకు మిత్రుడు అయి ఉండడానికి వీల్లేదు ..." అన్నాడు.

"పోనియ్యండి, సార్! ఎవరి వ్యక్తిగత జీవితాలు వాళ్ళవి. మన కెందుకు?" అన్నాడు పద్మనాభం.

"పాపం ... ఆ ఆడకూతురు తనలో తాను ఎంతగా బాధపడుతూ ఉంటుందో మీరు వూహించారా?" కోపంగా అన్నాడు ముత్యాలరావు.

"ఆవిడ నీతో చెప్పిందా?" అడిగాడు పెక్స నాఫీసరు.

"అమాత్రం అర్థం చేసుకో గలను, సార్! ఆమెను మనవాడితో రెండు మూడుసార్లు బజార్లో చూశాను. ఆమె కళ్ళల్లో గూడుకట్టుకుని ఉన్న దైన్యం ఆ విషయాన్ని స్పష్టంగా చెప్తుంది" అన్నాడు ముత్యాలరావు.

"ఎంత కథలు రాసేవాడివి అయినా అందరి విషయాలూ నీకు అనవసరం" అన్నాడు పెక్స నాఫీసర్.

"ఆ ... మీరు కథలు రాస్తారా?" అన్నాడు పద్మనాభం.

"ఏదో లెండి, 'ముత్యం' పేరుతో అరవై కథలు పంపితే, రెండు కథలు పడ్డాయి" అన్నాడు ముత్యాలరావు.

ఇంతలో లంచ్ బ్రేక్ అయ్యింది.

"నేను వస్తాను సార్! థాంక్స్ ఫర్ యువర్ పర్మిషన్. రేపు వస్తాను" అంటూ పద్మనాభం రూముకి వెళ్ళిపోయాడు. భోజనంచేసి కునుకుతీశాడు.

సాయంత్రం నిద్రలేచి చన్నీళ్ళతో స్నానం చేశాకా హాయిగా అన్పించింది.

అలా వూర్లోకి వెళ్ళి నాలుగు వీధులూ చుట్టబెట్టి వచ్చాడు.

తనకు ఇంకా పరిచయం కాని లోకేశ్వరరావు మీదకు ఆలోచనలు మళ్ళాయి. ముత్యాలరావు చెప్పింది నిజమేనా? అతనికి అబద్ధం చెప్పవలసిన అవసరం ఏమిటి? ఆ లోకేశ్వరరావు పట్టి అనుమానం మనిషి అయ్యుంటాడు. లేకపోతే భార్యను ఇంట్లో పెట్టి తాళం వేస్తాడా? అటువంటి వ్యక్తి గురించి తను ఎన్నడూ వినలేదు. ఎంత ఘోరం? పాపం ... ఆ అమ్మాయి ఎలా భరిస్తుందో? ఏమో! ... అయినా తను ఆ అమ్మాయికి అనుకూలంగా ఆలోచిస్తున్నాడు కనుక అలా అనుకుంటున్నాడు గానీ, ఆమెది అనుమానించ దగ్గ శీలం కావచ్చు. లోకేశ్వరరావు పరంగా ఆలోచిస్తే అలాంటి అమ్మాయిని భరిస్తున్నందుకు అతన్ని అభినందించాలి. అతను ఎందుకు భరించాలి ఆమెను? ఇష్టంలేకపోతే విడాకులు ఇయ్యవచ్చుగా! ఏమో! అందులో అతనికి ఏం కష్టనష్టా లున్నాయో!

కానీ ముత్యాలరావు మాటలు బట్టి చూస్తుంటే తప్పు లోకేశ్వరరావుదిలా గుంది.

ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు? అయినా ... తను అతని గురించి ఎందుకు ఆలోచించాలి? తన బాల్య స్నేహితుడి పేరు, ఇతని పేరు ఒకటే అయినందుకా?

వీళ్ళిద్దరూ ఒకటేనా? ... ఏమో! ...

తను, లోకేశ్వరరావు ఒకటో క్లాసునుంచి ఐదో క్లాసుదాకా చదువుకున్నారు. ఆ తర్వాత తన తండ్రి బదిలీ అయిపోవడంతో ఇద్దరూ విడిపోయారు. ఆ తర్వాత మళ్ళీ కలుసుకోనేలేదు. అయినా వాడితో ఉన్న ప్రాణస్నేహం కారణంగా ఇప్పటికీ వాడిని మర్చిపోలేదు. తను వాళ్ళింటికి వెళ్ళి ఆడుకునేవాడు. వాడుమాత్రం తను ఇంటికి రావడం తక్కువే! 'ఏరా?' అంటే 'మా అమ్మ ఎక్కడికీ వెళ్ళవద్దని అంటుందిరా ... జైల్లోలా ఇంట్లోనే ఉండమంటోంది' అనేవాడు. ఇద్దరూ కలిసి స్కూలుకి వెళ్ళేవారు. వచ్చేవారు. ఒక రోజు స్కూలునుంచి వస్తూ రోడ్డు పక్కన పాము, ముంగిస దెబ్బలాట చూస్తూ ఇంటికి రావడం ఆలస్యం చేశారు. ఆ రోజు తనని ఎవరూ ఏమీ అనలేదు గానీ ... లోకేశ్వరరావుకి ఏమైంది? ఆ మర్నాడు వాడు ఏడుస్తూ తనతో ఏమన్నాడు?

వాళ్ళమ్మ వాడిని చచ్చేటట్లు కొట్టిందట. స్కూలు నుంచి తిన్నగా ఇంటికి వచ్చెయ్యాలని అందట. క్రమ శిక్షణ లేకపోతే పిల్లలు పాడై పోతారని అందట. స్కూలునుంచి ఇల్లు చేరాకా ఇక ఇంట్లోంచి కదల

తపాలు మూలంగా చిత్రకళ!

వర్ణ చిత్రకళ పరిచయము



25 సంవత్సరములకు పైగాను తపాలు మూలముగా చిత్రకళను నేర్పుమా సంస్థ ప్రస్తుతం వర్ణచిత్రకళను కూడా నేర్పుట ప్రారంభించియున్నది. ఈ క్రింద వ్రాసియున్న వర్ణము సంబంధమైన పాఠములను మీకు నేర్పెదము.

నీటితో కలిపి తయారుచేసి పూయుట
(Water Colour Painting)
తైలవర్ణములు తయారుచేసికొని పూయుట
(Oil Colour Painting)
బ్రష్‌లు (కుంచె) లేకుండా చాకుతో (కత్తితో) చిత్రములను వ్రాయు పొందిక
(Pallette Knife)
సినిమా బేనర్లను చిత్రించుట
(Cine-Banner)

SANTHANU'S CHITIRA VIDYALAYAM
1957 25 1982
SILVER JUBILEE



వివరములకు 90 పైసలు స్టాంపులతో మనవి చేయుము.

SANTHANU'S CHITIRA VIDYALAYAM
C/o CHITIRA KULLAN (AP) Chintadripet, Madras-600 002.

కూడదని అందుట ... అవసరం అయితే తప్ప గుమ్మం దిగకూడదట. ఇంట్లోనే ఆడుకోవాలట పాపం ... పూర్ ఫెలో.

ఆలోచనలు చాలించి భోజనానికి వెళ్ళాడు పద్మనాభం.

• • • •

ఆ మర్నాడు ఒక అరగంట ముందుగానే ఆఫీసుకు వెళ్ళాడు పద్మనాభం. అప్పటికే ఎవరో వచ్చి లోకేశ్వరరావు సీట్లో కూర్చుని ఉన్నారు. ఇంకెవరు? లోకేశ్వరరావే. తనని తాను పరిచయం చేసుకుందుకు ఆ సీటు దగ్గరకు వెళ్ళిన పద్మనాభం ఆశ్చర్యంతో—

"ఒరేయ్ ... లోకేశం ..." అన్నాడు.

లోకేశ్వరరావు బిత్తరపోయి చూశాడు, తనని అంత చనువుగా పలకరించింది ఎవరా అని. లోకేశ్వర రావుకి మెడమీద ఉన్న పుట్టుమచ్చ కారణంగా పద్మనాభం అతన్ని మరింత తేలిగ్గా గుర్తించాడుగానీ, లోకేశ్వరరావు మాత్రం గుర్తించలేదు.

"ఒరేయ్! నేనురా ... పద్మనాభాన్ని— అమలాపురంలో నువ్వు ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పుడు మీ ఇంటి ఎదురుగా ఉండే పద్మనాభాన్ని మనిద్దరం ఒకే క్లాసు..." మెడడులో ఒక మూల పడిపోయి ఉన్న పద్మనాభంని బూజు దులిపి బయటకు తీశాడు లోకేశ్వరరావు.

"ఆఁ ... అవును. గుర్తొచ్చింది. సారీరా ..." అన్నాడు సంతోషంగా చేతులు కలుపుతూ.

లోకేశ్వరరావు ముఖంలో ఆనందం.

"అవును. ఇక్కడి కెలా వచ్చావు?" అడిగాడు.

విషయం అంతా వివరించి చెప్పాడు పద్మనాభం.

"శభాష్!... ఒకే స్కూల్‌లో చదువుకున్నందుకు ఒకే ఆఫీసులో గుమాస్తాలుగా చేరాం" అన్నాడు లోకేశ్వరరావు.

తల ఆడించాడు పద్మనాభం.

ఒక్కొక్కరే రాసాగారు ఆఫీసుకి.

"నీ ఎరికలో ఏదా ఇల్లుందని సెక్షనాఫీసరు గారు ..."

"సర్లే ... దాని సంగతి ఏముంది కానీ, అది నీకే దొరికేలా చేస్తాను. ఇంతకీ ఎక్కడ దిగావు?"

"లాడ్జిలో ..."

"నాన్సెన్స్...సాయంత్రం రూము ఖాళీ చెయ్యి— మా ఇంటికి వెళ్దాం. ఇల్లు దొరికే వరకూ మా ఇంట్లో ఉండొచ్చు" లోకేశ్వరరావు అన్నాడు.

"అబ్బే. ఎందుకురా. నీకు ఇబ్బంది." నసిగాడు పద్మనాభం.


"నువ్వు అలా తప్పించుకుంటే నేను బాధపడతా. మాకు ఏ ఇబ్బందీ కాదు. నా మాట కాదనకు."

"సరే."

ఇంతలో సెక్షనాఫీసరు వచ్చారు. ఆయన పరిచయం చెయ్యబోయ్యాడు లోకేశ్వరరావుని. పద్మనాభం చెప్పింది విని తల పంకించారు.

లంచి బ్రేకులో మిత్రు లిద్దరూ మరి కొన్ని కబుర్లు చెప్పుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఆ రకంగా కలియడం ఇద్దరికీ ఆనందంగా ఉంది.

వాళ్ళిద్దరి కబుర్లూ ఒక కంటితో గమనిస్తూనే




ఉన్నాడు ముత్యాలరావు.

సాయంత్రం నాలుగు గంటల సమయంలో వేరే సెక్షన్‌లోకి వెళ్ళాడు లోకేశ్వరరావు ఏదో పని ఉందని. అప్పుడు ముత్యాలరావు అన్నాడు పద్మనాభంతో ...

"అయితే, ఈయనే మీ బాల్య స్నేహితులన్న మాట."

"అవునండీ. స్నేహధర్మంగా ఇల్లు దొరికేవరకు నన్ను వాళ్ళింట్లో ఉండమని ఆహ్వానించాడు" అన్నాడు పద్మనాభం.

చెవులు ఒకసారి చేతులతో రుద్దుకున్నాడు ముత్యాలరావు.

"మళ్ళీ చెప్పండి. మీరు తప్పు చెప్పారో, లేక నేను తప్పు విన్నానో తెలియాలి" అన్నాడు.

నవ్వుతూ మళ్ళీ చెప్పాడు.

"ఏం నిర్ణయించుకున్నారు?" అడిగాడు ముత్యాలరావు.

"మీరు చెప్పండి ఏం చెయ్యమంటారో!"

"నన్ను అడిగితే వద్దనే అంటాను. ఆ పైన మీ ఇష్టం."

"ఎందుకని?"

"రామాయణం అంతా విని మళ్ళీ మొదటికి వచ్చారేమిటి, మహానుభావా? పెళ్ళాన్ని అంతగా అనుమానించే వాడు మిమ్మల్ని ఆ ఇంట్లో ఉండనిస్తాడా? ఏదో అభిమానంతో ఈ వేళ అన్నా, రేపు మిమ్మల్ని తన్ని తగలేస్తాడు. అది ఎంత అవమానకరం? ఆలోచించుకోండి."

అంతవరకూ ఆ విషయం గుర్తు రాలేదు పద్మనాభానికి. ఆ విషయం ముత్యాలరావు గుర్తు చెయ్యగానే ఆలోచించాడు తను ఏం చేస్తే బాగుంటుందా అని. ఇందాకా ఒకసారి వాడితో సరేనని చెప్పి ఇప్పుడు కాదంటే వాడు కారణం ఏమిటంటాడు. పోనీ అని వెళ్ళితే ముత్యాలరావు చెప్పినట్లు అవమానం జరిగితే కష్టం.

"ఆలోచించుకోండి" అన్నాడు ముత్యాలరావు.

లోకేశ్వరరావుతో ఉండాలనే నిశ్చయించుకున్నాడు. వాడిలో ఆ అనుమానపు భూతం ఎందుకు ప్రవేశించిందో తెలుసుకుని వాడిచేత ఈ వింత చర్యని మానిపించాలి. తన బాల్య స్నేహితుడిని అందరూ ఇలా అసహ్యించు కుంటుంటే అది తనకు మాత్రం అవమానం కాదూ?

"వెళతాను" అన్నాడు పద్మనాభం.

"ఓ. కె." అన్నాడు ముత్యాలరావు.

సాయంత్రం ఆఫీసు అవగానే మిత్రు లిద్దరూ బయటకు వచ్చారు.

"లాడ్జికి వెళదాం పద" అన్నాడు లోకేశ్వరరావు.

"ఎందుకు?" ప్రశ్నించాడు పద్మనాభం.

"ఎందుకేమిటిరా? రూము ఖాళీ చెయ్యి—మా ఇంట్లో ఉందువు కాని."

"అది సరే కానీ, ముందుగా నే నొకసారి మీ ఇల్లు చూడాలి. నా వల్ల మీకు ఏ రకమైన ఇబ్బందీ కలగదని నేను నిర్ణయించుకున్నాకనే రూము ఖాళీ చేసి మకాం మారుస్తాను."

"ఫరవాలేదు. పద."

"నో. నా మాట విను. ప్లీజ్."

"అప్పటినుంచీ నీలో ఆ మొండితనం అలాగే ఉందన్నమాట. సరే. పద" అంటూ ఇంటికి దారి తీశాడు లోకేశ్వరరావు.

ఇద్దరూ ఇల్లు చేరారు. ఇంటికి తాళం ఉంది.

"ఏం? మీ వాళ్ళు లేరా?" అడిగాడు పద్మనాభం అంతా మరిచిపోయి.

జవాబు చెప్పలేదు లోకేశ్వరరావు. ఆ మాట అసలు వినిపించనట్లే ఉండి పోయాడు.

జేబులోంచి తాళం చెవి తీసి తలుపు తీశాడు.

"రా." అంటూ లోపలకు వెళ్ళాడు. పద్మనాభం ఫాలో అయ్యాడు.

సోఫాలో కూర్చున్నాడు. లోకేశ్వరరావుకూడా కూర్చుని లోపలకు చూస్తూ—

"నీరజా... నీరజా!" అని పిలిచాడు.

లోపలనుంచి ఆమె వచ్చింది. చాలా సాధారణమైన అంద చందాలు, అమాయకత్వం చిందిస్తున్న ముఖం, మిలమిల మెరుస్తున్న కళ్ళు. లోకేశ్వరరావు పక్కన ఆమె నిలబడితే ఇద్దరికీ చక్కని జంట అని ఎవరైనా అంటారు.

కొత్త వ్యక్తిని చూసి ఆగిపోయింది.

లోకేశ్వరరావు పరిచయం చేశాడు. ఆమె చేతులు జోడించి ''నమస్తే'' అంది.

ఒక నిమిషం తరవాత—''కాఫీ తెస్తాను'' అంటూ వెళ్ళిపోయింది ఆమె.

లోకేశ్వరరావు ఏవేవో విషయాలు మాట్లాడుతున్నాడు కానీ, అవేమీ పద్మనాభం చెవికి ఎక్కటం లేదు. అతను నీరజ గురించి ఆలోచిస్తున్నాడు. ఆమెతో వీడు ఎందుకింత దారుణంగా ప్రవర్తిస్తున్నాడు? ముత్యాలరావు చెప్పినది నిజమే. నీరజని చూస్తే ఎవరికయినా ఆమె మీద జాలి కలగక మానదు. అయితే ఉన్న రాక్షసత్వం అంతా లోకేశ్వరరావుతోనే అయ్యుండాలి. వాడితో ఈ విషయం గురించి ప్రస్తావించాలి.

''ఏరా? జవాబు చెప్పవేం?'' అడిగాడు లోకేశ్వరరావు.

వాడు ఏం అడిగాడో తను వినిపించుకో లేదు. ఏం జవాబు చెప్పగలడు?

''ఆ. ఏమిటన్నావ్?'' తడబడుతూ అడిగాడు పద్మనాభం.

''ఏరా? ఏ లోకంలో ఉన్నావ్?''

''అహ! ఏదో ఆలోచిస్తున్నానులే. చెప్పు.''

ఇంతలో నీరజ రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చి అందించింది. కప్పు అందుకుంటూ ఆమె ముఖంలోకి మళ్ళీ చూశాడు.

ఆ అమాయక ముఖం అతన్ని కదిల్చి వేసింది.

లోకేశ్వరరావు నీరజతో అన్నాడు—

''వీడు ఇల్లు దొరికే దాకా మనింట్లోనే ఉంటాడు. మనతోనే భోజనం చేస్తాడు.''

''అలాగా. చాలా సంతోషం'' అంది. ఆ మాటల్లో ఎంత మాత్రమూ కపటత్వం లేదు.

''ఇల్లు చూశావుగా.. ఉండడానికి అభ్యంతరం లేదనుకుంటాను.'' లోకేశ్వరరావు పద్మనాభంతో అన్నాడు.

లేదన్నట్లు తల వూపాడు.

''పద. రూము ఖాళీ చేసి వద్దాం.''

''లేడికి లేచిందే పరుగని... రేపు ఉదయం వస్తానులే.''

''సరే. భోజనం చేసి వెళ్ళు.''

లోపలనుంచి వచ్చింది నీరజ—

''అన్నయ్యగారికి కూడా వంట చేస్తున్నాను'' అంది.

''కాస్సేపు అలా తిరిగి వద్దాం రాకూడదూ?'' పద్మనాభం అడిగాడు లోకేశ్వరరావుని.

''పద'' అని, నీరజతో-

''మేం అలా కాస్సేపు తిరిగి వస్తాం'' అన్నాడు, లేచి నిలబడి తాళం కప్ప చేతిలోకి తీసుకుని.

పద్మనాభంకూడా లేచాడు.

''ఎక్కువ ఆలస్యం చెయ్యొద్దు వంట చల్లారిపోతుంది'' అంది నీరజ.

అలాగేనంటూ ఇద్దరూ గుమ్మందాకా వచ్చారు. వీధి తలుపు బయట గడియ పెట్టి తాళం వేశాడు లోకేశ్వరరావు.

''ఎందుకురా తాళం వేశావు? ఆమె ఇంట్లోనే ఉందిగా'' అన్నాడు పద్మనాదం.

ఆ మాట వినిపించుకోకుండా అడుగులు వేశాడు లోకేశ్వరరావు.

పద్మనాభంకూడా అనుసరించాడు.

ఇద్దరూ రోడ్డు మీదకు వచ్చారు. ''ఎక్కడికి వెళదాం?'' అడిగాడు లోకేశ్వరరావు.

''కాస్సేపు తీరిగ్గా కూర్చుని నీతో మాట్లాడాలి. లాడ్జికే వెళదాం పద'' అన్నాడు పద్మనాభం.

మరో పావు గంటలో ఇద్దరూ లాడ్జి చేరారు. రూము తాళం తెరిచి లోపలకు వెళ్ళారు.

''కూర్చో'' అన్నాడు పద్మనాభం.

కూర్చున్నాడు లోకేశ్వరరావు.

చెప్పబోయేదానికి నాంది గా ఒకసారి గొంతు సవరించుకున్నాడు పద్మనాభం.

''లోకేశ్వరరావ్! చనువు తీసుకుని నీతో మాట్లాడుతున్నాను. నువ్వు నా బాల్య స్నేహితుడవన్న కారణంగా. నువ్వు మరోలా అనుకోకూడదు.''

ఆశ్చర్యంగా చూశాడు లోకేశ్వరరావు. తరవాత సర్దుకుని—

''ఫరవాలేదు. చెప్పు'' అన్నాడు.

''నీకు నీరజగారిమీద ఎందుకంత అనుమానం?''

తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుంచి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారనకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోఫై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెరుపు ఒక పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ఖరీదు రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

SHYAM AYURVED BHAVAN (AP)
P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105



రావూస్ క్లినిక్
టి.బి.రోడ్
తెనాలి

హస్తప్రయోగం, అంగం చిన్నదగుట నరముల బలహీనత శీఘ్రస్ఖలనము, సుఖవ్యాధులకు. పిచ్చి, మతిభ్రమలకు, శాస్త్రీయచికిత్స, పోస్టుద్వారాచికిత్సకలదు. స్వయంగా పరీక్షించి సలహాలు, మందులు ఇవ్వగలము.

డా॥ పి.వి.కె.రావ్ B.A.,
సెక్స్ స్పెషలిస్టు, వైద్యవిద్వాన్, వైద్యాచార్య
ఫోన్స్: 3700 అండ్ 4010
ఆయుర్వేద ఇంజక్షన్లు విద్యుచ్ఛక్తి పరికరములతో ప్రత్యేక చికిత్సకలదు.

PUSHPA SUVARNA.

"నీకు ఎవరు చెప్పారు?"

ఆ ప్రశ్నకు కొంచెం తడబడ్డాడు పద్మనాభం. లోకేశ్వరరావే అన్నాడు—

"ఎవరో చెప్పినా, నీవే గ్రహించినా ఒకటి మాత్రం నిజం. నీరజ మీద నాకు ఎటువంటి అనుమానమూ లేదు. నీరజ చాలా మంచిది. ఆమె నా భార్య కావడం నా అదృష్టం."

ఈ మాటలు విని ఆశ్చర్యపోవడం పద్మనాభం వంతు అయింది.

"అయితే. అయితే. ఆమెను ఇంట్లో ఉంచి తాళం ఎందుకు వేస్తావు?"

విరబగడి నవ్వాడు లోకేశ్వరరావు.

ఎందుకు నవ్వుతాడు వీ డిలాగ? అనుకున్నాడు పద్మనాభం.

"అందువల్ల నేను ఆమెను అనుమానిస్తున్నానని అనుకున్నావా?"

"అవును."

"నీరజను నేను అనుమానిస్తున్నానంటే అది నన్ను నేను అనుమానించుకున్నట్లే. రామాయణంలో సీత అంతటి పవిత్రురాలు ఆమె. ఆమె గురించి ఎవరు చెడ్డగా అనుకున్నా వాళ్ళకు పుట్టగతు లుండవు."

"అయితే మరి అలా ఎందుకు చేస్తున్నావు?"

"చెప్పనా?" అన్నాడు లోకేశ్వరరావు. అలా అన్నప్పుడు చిత్రంగా అతని గొంతు మారింది. కళ్ళు అరుణ వర్ణాలయాయి. ఆ వింత మార్పుకి ఆశ్చర్యపోయాడు పద్మనాభం.

"నా చిన్నతనం నీకు గుర్తుంది అనుకుంటా. సాయంత్రం పూట ఆడుకుందుకు గానీ, ఎవరింటి కయినా వెళ్ళడానికి కానీ ఒప్పుకునేది కాదు మాఅమ్మ. నన్ను ఒక్కడినీ ఇంట్లో ఉంచి బయట తలుపుకు తాళం పెట్టుకుని తను మాత్రం పొరుగింటి పుల్లమ్మ దగ్గరకో, ఎదురింటి ఎంకమ్మ దగ్గరకో వెళ్ళిపోయేది. అలా వెళ్ళి గంటలు గంటలు గడిపి వచ్చేది. నేను ఒక్కడినీ ఆ ఇంట్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ, కిటికీ వూచలు పట్టుకుని కన్నీళ్ళతో రోడ్డుమీద పోయే వాళ్ళను చూస్తూ ఉండేవాడిని. కనీసం నన్ను మీ ఇంట్లో ఆడుకో నియ్యమని బతిమాలేవాడిని. వెధవ తిరుగుళ్ళు తిరిగితే చెడిపోతానట. ఇంట్లో కూర్చుంటే క్రమ శిక్షణ అట. ఏ హాస్పిటల్‌కో వెళుతూనో లేక పిల్లలు రాకూడని చోటుకి వెళుతూనో నన్ను ఒక్కడ్నీ ఇంట్లో ఉంచి తాళం పెట్టి వెళితే నేను అంతగా ఫీలయ్యే వాడిని కాదు. ఆవిడ చేసే పెత్తనాలన్నీ ఎదురింటావిడ చీర చూడ్డానికో, పక్కింటావిడతో వంకాయ పచ్చడి గురించి డిస్కస్ చెయ్యడానికో తప్ప. అదేం అత్యవసరమైన పని కాదు."

పద్మనాభం వింటున్నాడు, కళ్ళు ఇంత చేసుకుని.

"నన్ను బయటకు వెళ్ళ వద్దంటే ఒప్పుకుంటాను. తను పని లేకుండా ఇల్లిల్లూ తిరిగినా ఒప్పుకుంటా. కానీ నన్ను ఇంట్లో ఉంచి తాళం వెయ్యవద్దని కోరాను. నన్ను చచ్చేటట్లు కొట్టింది. కొంపలో ఒంటరిగా బయట తాళం వేసినప్పుడు ఉంటే జైల్లో ఉన్నట్లే ఉంటుండేది. నాలో నేను ఎన్నోసార్లు ఏడిచాను. నా తండ్రితో చెప్పాను. ఆయన ఏమీ మాట్లాడలేదు. నా తల్లిమీద కోపం విత్తునుంచి పుట్టిన మహా వృక్షంలా రోజు రోజుకీ పెరగ సాగింది. కోపమే కాదు. ఆమె అంటే అసహ్యం కలిగింది. నేను పెద్దవాడినై నట్లు, ఆమెను ఇంట్లో ఉంచి నేను తాళం పెట్టి బయటకు వెళ్ళినట్లు కలలు కనే వాడిని. ఆ కల నిజం కావాలని కోరుకునే వాడిని. ఎందుకో తెలియదు. అలా ప్రతీకారం తీర్చుకోవడాన్ని ఏమంటారో తెలియదు. ఆమెపై కసి పెంచుకున్నాను."

"అయితే?"

"నువ్వు హిచ్ కాక్ ఆంగ్ల చిత్రం సైకో చూశావా?"

"చూశాను."

"కథ ఏమిటి?"

"ఒక తల్లి తన కొడుకుని చాలా ఆనాదరణతో పెంచుతుంది. ఆ కుర్రవాడిలో అసంతృప్తి పెరిగి తల్లిని అసహ్యించుకుంటాడు. ఆ అసహ్యం పెరిగి పెరిగి మొత్తం స్త్రీ జాతినే ఏవగించుకోవడం మొదలుపెడతాడు. పెద్దవాడై లాడ్జి నడుపుతూ అందులోకి బస చెయ్యడానికి వచ్చిన అమ్మాయిలను దారుణంగా హత్యచేసి శవాన్ని మాయం చేస్తుంటాడు. చివర్లో..." ఇంకా చెప్పబోతున్న పద్మనాభంని వారించి—

"చివర్లో ఏమైందో వదిలెయ్యి ... అలా అతను హత్యచెయ్యడానికి కారణం చిన్నప్పటి నుంచీ అతను తల్లి మీద పెంచుకున్న కసి... నేను కూడా ఇంచు మించు అలాగే తయారయ్యాను. అంత ఘోరంగా హత్యలు చెయ్యకపోయినా" ... లోకేశ్వరరావు అన్నాడు.

"అయితే నీ భార్య ఏం చేసింది?"

"అదే చెప్తున్నాను. నాకు ఉద్యోగం వచ్చాక మా నాన్నగారు పోయారు. నా తల్లి నా దగ్గరే ఉండేది. ఆమెను ఇంట్లో ఉంచి తాళం వేసి ఆఫీసుకి వెళ్ళేవాడిని. నా కల నిజం అయినందుకు ఆనందిస్తూ ఉండేవాడిని. అలా తాళం వెయ్యడం అలవాటు అయ్యింది. ఆ తర్వాత నాకు పెళ్ళి అయ్యింది. నీరజ ఆ అలవాటు తప్పని నాతో వాదించేది. దాంతో ఆమెమీద కూడా అసహ్యం పెంచుకున్నాను. నాకు తెలియకుండా నాలోనే ఒక విచిత్రమైన మానసిక పరిణామం జరుగుతోంది. నీరజను నేను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తాను. కానీ ఆమెను ఇంట్లో ఉంచి తాళం వెయ్యకపోతే..."

"ఏమవుతుంది?"

"నాలో విపరీతమైన మార్పులు వస్తాయి. బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతుంది. తలనొప్పి వస్తుంది. కాళ్ళలో వణుకు పుడుతుంది. గొంతు తడి ఆరి పోతుంది. అందుకే అమ్మ చనిపోయిన తర్వాతకూడా నీరజను ఇంట్లో ఉంచి తాళం వేస్తున్నాను. రెండు మూడు సార్లు వెయ్య కుండా ప్రయత్నించాను కానీ, అడుగు ముందుకు పడదు. ఆ బ్లడ్‌ప్రెషరూ, తలనొప్పి చూసి తనను లోపల ఉంచి తాళం వెయ్యమని నీరజే కోరింది. తను ఏమీ అనుకోనంది. అందుకే ఈ పద్ధతి సాగుతోంది."

లోకేశ్వరరావు వంక ఆశ్చర్యంతో చూశాడు పద్మనాభం. ఒక నిముషం ఆగి లోకేశ్వరరావు అన్నాడు.

"ఇదంతా ఇక్కడి వాళ్ళకు తెలియదు. అమ్మ పోయిన నాలుగు నెలలకు ఈ వూరు బదిలీ అయి వచ్చాను. ఆ తర్వాత ఎన్నో రకాలుగా కాంప్లెక్స్ నుండి బయటపడాలని ప్రయత్నించాను కానీ, ఆ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయ్యాయి. చిన్నప్పుడు విపరీతంగా అమ్మ మీధ పెంచుకున్న కసి వీటికంతా మూలం..."

"కానీ నీ గురించి అందరూ ఏమనుకుం టున్నారో ..."

"నాకు తెలుసు. అందుకు నాలో నేను కుమిలి పోయే వాడిని. నీరజను అందరూ జాలితో చూస్తున్నారనీ తెలుసు. వాళ్ళ మాటలకు నా గుండెలు పిండి అయ్యేవి. అందుకే మళ్ళీ ప్రయత్నంచేశాను, ఇంటికి తాళం వెయ్యకుండా రావడానికి. కానీ ఆ బ్లడ్‌ప్రెషర్, తలనొప్పి, కాళ్ళు వణకడం— నన్ను వదలలేదు. ఒక్కొక్కసారి ఆ బాధతో చచ్చి పోతానేమో అన్పించేది. ఆ బాధ భరించటం కంటె అనుమానపు మొగుడంటూ సూటిపోటి మాటలు భరించడమే తేలిక అన్పించింది. అందుకే ఇక నేను ఎవర్నీ పట్టించుకోవడం లేదు. నువ్వు ఈ వూరు వచ్చి రెండు రోజులే అయినా ఈ విషయం నీకు తెలిసిపోయి ఉంటుందని వూహించాను. నాతో ఒక విషయం మాట్లాడాలని అన్నప్పుడు దీన్ని గురించే అని గ్రహించాను" అన్నాడు లోకేశ్వరరావు.

"నీకు నిజమైన మిత్రుడిని కనుక నిన్ను అందరూ అలా చులకనగా మాట్లాడుతుంటే భరించలేక నువ్వు నిజంగా అనుమానంతో అలా చేస్తున్నావావేమోననీ నీకు బుద్ధిచెప్పాలని అనుకున్నాను. నన్ను క్షమించు లోకేశం! ఈ కుళ్ళు సమాజం నిన్ను అర్థం చేసుకోలేకపోయినా నేను అర్థం చేసుకున్నాను. అంతేకాదు. నీలో ఈ కాంప్లెక్స్ దూరం చెయ్యడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు పద్మనాభం.

"ఎలా?"

"నాకు తెలిసిన ఒక మిత్రుడు సైకియాట్రిస్ట్. అతను దీనికి తప్పకుండా వైద్యం చెయ్యగలడు. రేపే ఉత్తరం రాస్తాను" అన్నాడు పద్మనాభం.

"థాంక్స్ రా! దీన్నుంచి నేను బయటపడ గలిగితే నా నీరజకు నేను "న్యాయం చేస్తున్నా నన్న బాధ ఉండదు. నీరజ దేవతరా! దేవత ... నీ ప్రయత్నం ఫలిస్తే నీకు ఆ జన్మాంతం ఋణపడి ఉంటాను" అన్నాడు లోకేశ్వరరావు.

పద్మనాభం మాట్లాడలేదు. లోకేశ్వరరావు వంక ప్రేమగా చూశాడు.

"పద... ఇంటికి వెళ్దాం. నీరజ మనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అంటూ లేచాడు లోకేశ్వరరావు.

పద్మనాభం కూడా లేచి "పద" అన్నాడు. *

## కాకతాళీయం

కాకతాళీయం సూత్రాన్ని వివరించి అర్థం చెప్పిన మాష్టారు, "ఏదైనా ఒక ఉదాహరణ చెప్పండి" అన్నాడు పిల్లలతో. చాలాసేపు ఎవరూ నోరెత్తలేదు.

చివరకు ఓ చిన్న పిల్ల, "మా తల్లీ, దండ్రి ఒకే రోజున పెళ్ళి చేసుకున్నారండీ" అని ఉదాహరించింది.

— ప్రనీల్